క్లుప్తంగా

వైద్యశిబిరం



పలుకు పాఠశాల చిన్నారులతో జాన్‌వెస్లీ ఫౌండేషన్ సిబ్బంది

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): స్థానిక ఐటీసీఎల్ కాలనీలోని పలుకు బధిరుల ఆశ్రమ పాఠశాలలో శనివారం జాన్‌వెస్లీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. అక్కడి పిల్లలకు వివిధ రకాల వైద్య పరీక్షలు జరిపారు. అవసరమైన మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జాన్‌వెస్లీ ఫౌండేషన్‌కు పలుకు సంస్థ నిర్వాహకురాలు గంటా కనకదుర్గ కృతజ్ఞతలు తెలిపారు.

మర్యాదపూర్వకంగా..



హైకోర్టు న్యాయమూర్తి జయసూర్యకు మొక్కలు అందజేస్తున్న కలెక్టర్ ప్రశాంతి, ఎస్పీ నరసింహ కిషోర్

సీటీఆర్‌ఐ: జిల్లా పర్యటనకు విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎస్. జయసూర్యను శనివారం కలెక్టర్ జి.ప్రశాంతి మర్యాదపూర్వకంగా కలిశారు. స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఆయనకు పూలమొక్క అందజేసి అభినందనలు తెలిపారు. అలాగే ఎస్పీ నరసింహ కిషోర్ న్యాయమూర్తి జయసూర్యను మర్యాదపూర్వకంగా కలిసారు.

అమ్మ వాసుకు టూరిజం ఎక్స్‌లెన్స్ అవార్డు



మంత్రి దుర్గేష్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న అమ్మ వాసు

రాజమహేంద్రవరం సిటీ: పాపికొండల పర్యాటక రంగంలో అనుభవం గలిగిన అమ్మ టూరిజం, ట్రావెల్స్ అధినేత పిన్నేపల్లి శ్రీనివాసరావు (అమ్మ వాసు)కు టూరిజం ఎక్స్‌లెన్స్ అవార్డు లభించింది. ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేష్ చేతుల మీదుగా అమ్మ వాసు అవార్డును అందుకున్నారు. 2023 – 24 సంవత్సరానికి గాను ట్రావెల్ ఏజెంట్ బోటింగ్ విభాగంలో ఆయనకు ఈ రాష్ట్ర స్థాయి టూరిజం ఎక్సలెన్స్ అవార్డు ప్రదానం చేశారు. బెస్ట్ ట్రావెల్ ఏజెంట్‌గా అవార్డు అందుకున్న అమ్మ వాసును నగరానికి చెందిన పలువురు ప్రముఖులు అభినందించారు.

దరఖాస్తుల ఆహ్వానం

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): రాజమహేంద్రవరం ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో ఎన్‌టీఆర్ వైద్య సేవా పథకం ద్వారా వైద్యం పొందే రోగులకు అవసరమైన స్కానింగ్ సేవలు, ఆర్థో ఇంప్లాంట్స్ సరఫరాకు అర్హత కలవారి నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.లక్ష్మీసూర్యప్రభ తెలిపారు. ఆమె శనివారం మాట్లాడుతూ దరఖాస్తులకు అక్టోబర్ 18 వరకు గడువు ఉందన్నారు. వివరాలకు ప్రభుత్వ ఆస్పత్రిలో సంప్రదించాలన్నారు. మరింత సమాచారం కావాలంటే జీజీహెచ్ మేనేజర్ నంబర్ 94910 40295కు ఫోన్ చేయాలని కోరారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి



సీలింగ్ ఫ్యాన్లు అందజేస్తున్న కమిషనర్ కేతన్ గార్గ్

రాజమహేంద్రవరం సిటీ: భారత రత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాల సాధనకు అందరూ కృషి చేయాలని కార్పొరేషన్ కమిషనర్ కేతన్ గార్గ్ పిలుపునిచ్చారు. రాజమహేంద్రవరంలో అంబేడ్కర్‌కు పౌరసన్మానం జరిగి శనివారానికి 80 ఏళ్లు పూర్తయ్యింది. ఈ సందర్భంగా నగరపాలక సంస్థ కార్యాలయంలోని అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. కమిషనర్ మాట్లాడుతూ అంబేడ్కర్ నడయాడిన నేలపై, ఆయన సన్మానం పొందిన ఆఫీసులో కమిషనరుగా సేవలు అందించడం తన అదృష్టమన్నారు. ఈ సందర్భంగా సుబ్బారావుపేటలోని ఆనంద నిలయం అనాథ బాలల హాస్టల్‌కు నగరపాలక సంస్థ ఉద్యోగులు కమిషనర్ చేతుల మీదుగా పది సీలింగ్ ఫ్యాన్లు, పది ట్యూబ్‌లైట్లు అందజేశారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ పీఎం సత్యవేణి, డిప్యూటీ కమిషనర్ ఎస్‌వీ రమణ, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ ఎ.వినూత్న పాల్గొన్నారు.



టీటీడీ కల్యాణ మండపంలో కొబ్బరికాయలు కొడుతున్న షర్మిలారెడ్డి తదితరులు



కడియం వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న గిరజాల వీర్రాజు(బాబు) తదితరులు



ధవళేశ్వరం వేంకటేశ్వరస్వామి ఆలయంలో..

చంద్రబాబును క్షమించు స్వామీ..

- వేంకటేశ్వరస్వామికి వైఎస్సార్ సీపీ నాయకుల పూజలు
- తరలివచ్చిన పార్టీ శ్రేణులు

సీటీఆర్‌ఐ: తిరుపతి లడ్డూ కల్తీ జరిగిందంటూ దేవుడిని కూడా రాజకీయాల్లోకి లాగిన ముఖ్యమంత్రి చంద్రబాబును క్షమించాలని ఏడుకొండల స్వామిని వైఎస్సార్ సీపీ నాయకులు వేడుకున్నారు. ఈ మేరకు రాజమహేంద్రవరం సిటీ, రూరల్ నియోజకవర్గాల్లోని ఆలయాలలో శనివారం పూజలు నిర్వహించారు. చంద్రబాబుకు సద్బుద్ధిని ప్రసాదించాలంటూ దేవుళ్లను కోరుకున్నారు. దేవీచౌక్‌లోని వేంకటేశ్వరస్వామి దేవాలయంలో మాజీ ఎంపీ భరత్‌రామ్ పూజలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మత విద్వేషాలు సృష్టించడానికి చంద్రబాబు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. స్థానిక టీటీడీ కల్యాణ మండపంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి పూజలు జరిపారు.

రాజకీయాలు మానుకోండి

రాజమహేంద్రవరం రూరల్: హిందువుల మనోభావాలతో కూటమి నేతలు రాజకీయాలు చేయడం మానుకోవాలని వైఎస్సార్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు ముద్దాల అను ఆగ్రహం వ్యక్తం చేశారు. న్యాయవాది, గొందేశి పూర్ణచంద్రారెడ్డి చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకుడు గొందేశి శ్రీనివాసులరెడ్డి సూచనల మేరకు ఆయన ఆధ్వర్యంలో శనివారం బొమ్మూరు వేకటేశ్వర నగర్‌లోని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముద్దాల అను మాట్లాడుతూ తిరుపతి లడ్డూ ప్రసాదం మీద లేనిపోని అనుమానాలు కలిగిస్తూ కోట్లాది మనోభావాలు దెబ్బతీసే విధంగా కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తోందన్నారు. కార్యక్రమంలో నాయకులు సీతారాం చరణ్, మరడాపు శేఖర్, కేపీ నాయుడు, సూరంపూడి గోపి, కోటిపల్లి రవీంద్ర పాల్గొన్నారు.



శాటిలైట్‌సిటీ శివాలయంలో వైఎస్సార్ సీపీ నాయకులు



బొమ్మూరు వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న ముద్దాల అను తదితరులు

▶▶ తొర్రేడులోని గణపతి మందిరంలో వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో పార్టీ గ్రామ నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తిరుమల లడ్డూ ప్రసాదంపై అనుచిత వ్యాఖ్యలు చేసిన సీఎం చంద్రబాబుకు సద్బుద్ధిని ప్రసాదించాలని కొబ్బరికాయలు కొట్టారు. కార్యక్రమంలో మాజీ సొసైటీ చైర్మన్ చిట్టూరి వెంకటరావు, గద్దే సుబ్బారావు పాల్గొన్నారు.



తొర్రేడులోని గణపతి మందిరంలో వైఎస్సార్ సీపీ నాయకుల పూజలు

▶▶ శాటిలైట్ సిటీలోని ఉమా పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో శనివారం గ్రామ వైఎస్సార్ సీపీ కమిటీ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలుపరచకుండా ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు సీఎం చంద్రబాబు తిరుపతి లడ్డూలో కల్తీ నెయ్యి కలిసిదంటూ దుష్ప్రచారం చేస్తున్నారన్నారు.

తిరుమల పవిత్రతను కాపాడాలి

కడియం: తిరుమల పవిత్రతను, ప్రతిష్టను కాపాడాలని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి గిరజాల వీర్రాజు (బాబు) అన్నారు. కడియంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం పార్టీ శ్రేణులతో కలిసి ఆయన ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయం బయట చంద్రబాబు వ్యాఖ్యలను నిరసిస్తూ ఆందోళన చేశారు. బాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రతీకారాలు, కక్ష సాధింపు ధోరణితో పరిపాలన సాగిస్తోందన్నారు. కార్యక్రమంలో శివాలయం మాజీ చైర్మన్ ఆర్ఎస్ఎన్ మూర్తి, పంచాయతీ వార్డు సభ్యులు దాసరి నాగేంద్ర , చెక్కా కాశి, దంగుడు బియ్యం సుబ్బారావు, పార్టీ నాయకులు గుత్తుల వాసు, చిలుకూరి రామకృష్ణ, మైపాల వాసు, కడియం గణేష్, శిరంశెట్టి మూర్తి, పున్నమిరాజు వీర్రాజు, ఎస్.వీరనాగు, బొమ్మిరెడ్డి సత్తిబాబు పాల్గొన్నారు.

దేవుడి పేరుతో రాజకీయం తగదు

ధవళేశ్వరం: కల్తీ నెయ్యి అంటూ దేవుడి పేరుతో రాజకీయం చేయడం తగదని ధవళేశ్వరం వైఎస్సార్ సీపీ నాయకులు పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం గ్రామంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో సాధనాల చంద్రశేఖర్ (శివ) ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. లడ్డూపై నిరాధారమైన ఆరోపణలు చేయడంతో భక్తుల మనోభావాలు దెబ్బతింటున్నాయన్నారు. కార్యక్రమంలో పందెళ్ల భానుప్రసాద్, ఎస్‌వీ శేఖర్, గోలి దేవకుమార్, ముత్యాల పోసికుమార్, పరమళ్ల నారాయణ, ముత్యాల జాన్, మోర్త పావనమూర్తి, జంగా కిషోర్, చొల్లంగి సత్యగిరి, గునిపే అశోక్, ముద్దాడ బాబి, ఇందల మెహర్ కుమార్ పాల్గొన్నారు.

ఆర్ట్స్ కళాశాలలో సర్వేపల్లి స్మారక ప్రసంగం

కంబాలచెరువు: స్థానిక ఆర్ట్స్ కళాశాలలో ఫిలాసఫీ డిపార్టుమెంట్ ఆధ్వర్యంలో శనివారం డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ స్మారక ప్రసంగం నిర్వహించారు. ఆయనతో ఆర్ట్స్ కళాశాలతో ఉన్న అనుబంధానికి గుర్తుగా ఈ సంవత్సరం నుంచి స్మారక ప్రసంగం కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు డిపార్ట్‌మెంట్ ఇన్‌చార్జి డాక్టర్ కె.సీతామహాలక్ష్మి తెలిపారు. ఇంగ్లిషులెక్చరర్ సూజిళ్ల శ్రీనివాస్ గీతాలతో కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం డీన్ డాక్టర్ కొట్టే రమేష్ మాట్లాడుతూ సర్వేపల్లి గొప్పదనాన్ని వివరించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర ఆర్కే మాట్లాడుతూ ఆర్ట్స్ కళాశాలలో అనేక కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. అందులో భాగంగా ఫిలాసఫీని కళాశాల వారసత్వ చిహ్నంగా తెలియజేశారు. ఈ సందర్భంగా దీక్షారంభ కార్యక్రమంలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో పార్థసారథి, సత్యం సూర్యనారాయణ, సోషల్‌వర్క్ లెక్చరర్ ఎస్.రాణి, కె.కుసుమ కుమారి పాల్గొన్నారు.



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర

త్వరలో జీఎస్‌కేఎం లా కాలేజీ 40వ వార్షికోత్సవం

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): గుర్రాల సత్యేంద్ర కృష్ణ మెమోరియల్ (జీఎస్‌కేఎం) లా కాలేజీ 40వ వార్షికోత్సవాన్ని త్వరలో నిర్వహించనున్నట్టు ఆ కళాశాల డైరెక్టర్ పి.శరత్ కృష్ణ తెలిపారు. స్థానిక ప్రెస్ క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తన నానమ్మ స్వర్గీయ వి.శారదా హెచ్ రావు 1983లో కళాశాలను నెలకొల్పారన్నారు. పిడింగొయ్యిలో మూడెకరాల స్థలంలో భవనాలు నిర్మించారని తెలిపారు. ఇక్కడ చదివిన వారిలో నాలుగువేల మంది వివిధ బార్ అసోసియేషన్లలో న్యాయవాదులుగా నమోదై, ప్రాక్టీస్ చేస్తున్నారని, హైకోర్టులో ఐదుగురు జడ్జిలుగా, దాదాపు 40మంది డిస్ట్రిక్ట్ జడ్జిలుగా ఉన్నారని వివరించారు. అయితే ఇటీవల కళాశాల పేరు ప్రతిష్ఠలను దెబ్బతీసేలా కొన్ని అవాస్తవ ప్రచారాలు సాగుతున్నాయని ఆవేదన చెందారు. సమావేశంలో ప్రిన్సిపల్ ఎస్.మధుసూదనరావు, సూపరింటెండెంట్ ఎస్ఎస్‌వీ లక్ష్మణరావు పాల్గొన్నారు.

లతామంగేష్కర్ జయంతి



వద్దాది నాగేంద్రను లతామంగేష్కర్ అవార్డుతో సత్కరిస్తున్న జిత్‌మోహన్‌మిత్ర తదితరులు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): మధుర గాయని లతా మంగేష్కర్ జయంతిని శనివారం జిత్ మోహన్ మిత్ర కళావేదికపై ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నటుడు, గాయకుడు జిత్ మోహన్ మిత్ర మాట్లాడుతూ లతాజీ జీవితం అందరికీ ఆదర్శప్రాయమన్నారు. కార్యక్రమానికి ఆత్మీయ అతిథులుగా గుమ్మడి సమర్పణ రావు, బి.సీతారామారావు, పీవీఎస్ కృష్ణారావు, వద్దాది నాగేంద్ర, ఏఎస్ ఆనంద్, వి.జగపతి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిత్ మోహన్ మిత్ర ఆర్కెస్ట్రా తరఫున 30 ఏళ్లుగా సేవలందించిన వి.నాగేంద్రను లతాజీ పురస్కారంతో సత్కరించారు.

డిజిటల్ మానిటరింగ్ మెషీన్ వితరణ



మెషీన్ అందజేస్తున్న జేసీఐ జోన్ ప్రెసిడెంట్ కృష్ణ భాస్కర్, రామదేవు గీత తదితరులు

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరులోని వివేకానంద ఆరోగ్య కేంద్రానికి జేసీఐ రాజమహేంద్రవరం పెరల్స్ సంస్థ డిజిటల్ మానిటరింగ్ మెషీన్‌ను శనివారం అందజేసింది. ఈ సందర్భంగా వివేకానంద ఆరోగ్య కేంద్రం డాక్టర్ పుల్లారావు మాట్లాడుతూ రోగులకు మరింత మెరుగైన, కచ్చితమైన వైద్యపరీక్షలు చేయడానికి ఈ మెషీన్ ఉపయోగపడుతుందన్నారు. దీన్ని అందించిన జేసీఐ రాజమహేంద్రవరం పెరల్స్ అధ్యక్షురాలు రామదేవు గీత, మిగిలిన సభ్యులకు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన జూనియర్ చాంబర్ ఇంటర్నేషనల్ (జేసీఐ) జోన్ ప్రెసిడెంట్ జేసీ కృష్ణభాస్కర్ విచ్చేశారు. సెక్రటరీ లావణ్య, కోశాధికారి ఐశ్వర్య, ఐపీపీ వాసవి, శ్రీకన్య, వాసవీ చైతన్య పాల్గొన్నారు.

మంచి అలవాట్లతో గుండె వ్యాధులు దూరం

కంబాలచెరువు: ఆరోగ్యకరమైన ఆహారం తింటూ, శరీరానికి అనువైన వ్యాయామం చేసుకోవడం ద్వారా గుండె వ్యాధులకు దూరంగా ఉండవచ్చని ఎస్పీ డి.నరసింహ కిశోర్ అన్నారు. ప్రపంచ గుండె వ్యాధుల నివారణ దినోత్సవం సందర్భంగా కిమ్స్ హాస్పిటల్, జిల్లా పోలీసుల సంయుక్త ఆధ్వర్యంలో శనివారం 3 కే హెల్త్ వాక్ నిర్వహించారు. కిమ్స్ ఆసుపత్రి నుంచి పుష్కర్ ఘాట్ వరకూ ఈ ర్యాలీ జరిగింది. అనంతరం ఎస్పీ డి.నరసింహ కిషోర్ మాట్లాడుతూ జీవన శైలిలో కొన్ని మార్పులు చేసుకోవడం ద్వారా గుండె వ్యాధులకు దూరంగా ఉండవచ్చన్నారు. కార్పొరేషన్ కమిషనర్ కేతన్ గార్గ్ మాట్లాడుతూ గుండె ఆరోగ్యంగా ఉండాలంటే జీవనశైలిని మార్చుకోవాలన్నారు. తద్వారా ఆరోగ్యకరమైన జీవితాన్ని పొందవచ్చన్నారు. కిమ్స్ ఆసుపత్రి ఈడీ స్వర్ణ రామ్మోహనరావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ గుండె సంబంధిత వ్యాధులపై అవగాహన పెంచుకుంటే, దానిని దరిదాపులకు కూడా రాకుండా చేయవచ్చన్నారు. దీనికోసం కిమ్స్ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. గుండె వ్యాధిగ్రస్తులకు కిమ్స్ అనేక అధునాతన టెక్నాలజీ విధానాలను అందుబాటులోకి తీసుకువచ్చి అందిస్తోందన్నారు. ఆసుపత్రి చీఫ్ కార్డియాలజిస్ట్ ఎన్. రామరాజు మాట్లాడుతూ గుండె జబ్బుల కారణంగా ఏటా దాదాపు రెండు కోట్ల మంది మరణిస్తున్నారని, మెడికల్ సర్టిఫికేషన్ ఆఫ్ కాజ్ ఆఫ్ డెత్ ప్రకారం గుండె జబ్బుల కారణంగా 57 శాతం మరణాలు 25 నుంచి 69 ఏళ్ల మధ్య ఉన్న వయసున్న వారివే ఉంటున్నాయన్నారు. నిత్యం వ్యాయామం చేయడం, గంట పాటు నడక, ఎనిమిది గంటలకు తక్కువ కాకుండా నిద్ర అలవాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కిమ్స్ ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది, రోటరీ క్లబ్ ఆఫ్ రాజమహేంద్రవరం, రివర్ సిటీ క్లబ్ రాజమహేంద్రవరం, గైట్ కాలేజ్ ఆఫ్ ఫార్మసీ, సాయి విద్యాసంస్థలు, వీజే కాలేజ్ ఆఫ్ ఫార్మా, లా హాస్పిస్ సిబ్బంది పాల్గొన్నారు.



ర్యాలీని ప్రారంభిస్తున్న ఎస్పీ నరసింహ కిశోర్, కార్పొరేషన్ కమిషనర్ కేతన్ గార్గ్

రేబిస్‌పై ప్రజలకు అవగాహన

రాజమహేంద్రవరం రూరల్: రేబిస్ వ్యాధిపై ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పిస్తున్నామని ఇన్‌చార్జి డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ వసుంధర అన్నారు. ప్రపంచ రేబిస్ డే సందర్భంగా శనివారం బొమ్మూరులోని డీఎంఅండ్‌హెచ్‌వో కార్యాలయం వద్ద అవగాహన ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ వసుంధర మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, అర్బన్ హెల్త్ సెంటర్లు, ఏరియా ఆసుపత్రులు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, ప్రభుత్వాసుపత్రుల్లో రేబిస్ వ్యాధిపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ ఈ ఏడాది 'బ్రేకింగ్ రేబిస్ బౌండరీస్' అనే నినాదం ఇచ్చిందన్నారు. జిల్లాలో యాంటీ రేబిస్ వ్యాక్సిన్ (ఏఆర్‌వీ) డోసులు తగినన్ని అందుబాటులో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో జిల్లా సర్వేలెన్స్ అధికారి డాక్టర్ రాజీవ్, జిల్లా ఏపీడిమాలజిస్ట్ డాక్టర్ సుధీర్ తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య, ఆరోగ్య సిబ్బంది

చాంబర్ పాలకమండలి ఎన్నిక ఏకగ్రీవం

రాజమహేంద్రవరం సిటీ: ది రాజమండ్రి చాంబర్ ఆఫ్ కామర్స్ నూతన పాలక మండలిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా తవ్వా సూర్యనారాయణమూర్తి (రాజా), కార్యదర్శిగా ఆకుల శ్రీనివాస్, ఇతర సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ విషయాన్ని చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, కార్యదర్శి మద్దుల మురళీకృష్ణ శనివారం తెలిపారు. ఉపాధ్యక్షులుగా వంటిద్దు సూరిబాబు, యియ్యపు మురళీధర్, కోశాధికారిగా అల్లంకి నాగేశ్వరరావు, సంయుక్త కార్యదర్శిగా తోట లక్ష్మీనారాయణ (కన్ను), ట్రస్ట్ బోర్డు డైరెక్టర్లుగా గ్రంధి బ్రహ్మానందం, పచ్చిగోళ్ల సురేష్ కుమార్, నూలి శివ మల్లికార్జున, డైరెక్టర్ల స్థానాలకు పలువురిని ఎంపిక చేశామన్నారు. ఈ మేరకు ఆదివారం ఇప్పటి వరకూ బాధ్యతలు నిర్వహించిన పాలక మండలి ఆధ్వర్యంలో జనరల్ బాడీ సమావేశం జరుగుతుందన్నారు.

వర్తకుల శ్రేయస్సు కోసమే..

సీటీఆర్‌ఐ: వర్తకుల శ్రేయస్సు కోసం రాజమండ్రి చాంబర్ ఆఫ్ కామర్స్ పాలకవర్గం ఏకగ్రీవం అయ్యేందుకు కూటమి తరఫున తమ వంతు కృషి చేశామని, దీనికి మాజీ అధ్యక్షులు కూడా పెద్దమనసుతో సహకరించారని సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. ఏకగ్రీవంగా ఎన్నికైన చాంబర్ పాలకవర్గం, కూటమి నాయకులతో కలిసి తిలక్ రోడ్డులోని తన కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తవ్వా రాజా ప్యానెల్ ఏకగ్రీవంగా ఎన్నికవ్వడానికి అందరూ సహకరించారని సంతోషం వ్యక్తం చేశారు. వర్తకులకు ఏ సమస్య వచ్చినా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతానని హామీ ఇచ్చారు.





తవ్వా సూర్యనారాయణమూర్తి, ఆకుల శ్రీనివాస్

ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ల బదిలీలు

రాజమహేంద్రవరం రూరల్: ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తూ ఆ శాఖ డైరెక్టర్ నిషాంత్ కుమార్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నేపథ్యంలో రాజమహేంద్రవరం నార్త్‌స్టేషన్‌కు రెడ్డి త్రినాథ్, రాజమహేంద్రవరం సౌత్‌స్టేషన్‌కు పి.సుబ్బిరెడ్డి, కోరుకొండకు జె.శ్రీనివాస బాలాజీ, కొవ్వూరుకు జి.సత్యనారాయణ, దేవరపల్లికి బళ్లా శ్రీనివాసరావు, నిడదవోలుకు ఆర్‌జే సతీష్‌బాబు, రంగంపేటకు డి.సుధ నియమితులయ్యారు. రాజమహేంద్రవరం ఈఎస్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్‌గా పి.హనుశ్రీని నియమించారు.

ఐఎంఎల్ డిపో మేనేజర్‌గా కేదారి శ్రీధర్

ఏపీస్టేట్ బేవరేజస్ కార్పొరేషన్ లిమిటెడ్ రాజమహేంద్రవరం ఐఎంఎల్ డిపో ఎక్సైజ్ సూపరింటెండెంట్ (మేనేజర్)గా కేదారి శ్రీధర్‌ను నియమించారు.

అసిస్టెంట్ కమిషనర్ పోస్టు మినహా..

గత ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్)ను ప్రస్తుత కూటమి ప్రభుత్వం రద్దు చేసి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖలో విలీనం చేసింది. దీంతో జిల్లా పరిధిలో ఒక అసిస్టెంట్ కమిషనర్, ఎక్సైజ్ సూపరింటెండెంట్, రెండు ఏఈఎస్‌లు పోస్టులను కేటాయించింది. ఇప్పటికే ఎక్సైజ్ సూపరింటెండెంట్‌గా సీహెచ్ లావణ్య, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్‌గా నాగ రాహుల్, ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్ అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్‌గా ఎం.వినీషను నియమించిన విషయం తెలిసిందే. ఈఎస్ లావణ్య, ఏఈఎస్ వినీష రెండు రోజుల క్రితమే బాధ్యతలు స్వీకరించారు. అసిస్టెంట్ కమిషనర్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) పోస్టును మాత్రం ప్రభుత్వం వేకెంట్‌లో ఉంచింది.

చంద్రబాబుపై వ్యాఖ్యలు చేస్తే ఊరుకోం

రాజమహేంద్రవరం రూరల్: సీఎం చంద్రబాబు నాయుడుపై వ్యాఖ్యలు చేస్తే ఊరుకోబోమని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి అన్నారు. తన నివాసంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. తిరుమలలో లడ్డూ ప్రసాదాన్ని జంతు కొవ్వులను కలిపి అపవిత్రం చేశారని ఆరోపించారు.